# రెండు బిస్కట్లు కుదిరితే కప్పు కాఫీ

**జి.వి.వి.సుబ్రహ్మణ్యం**




విశాఖపట్నంలో ప్రొద్దుట ఏడు గంటలకల్లా బయల్దేరింది బండి. విజయవాడ వైపు దూసుకుపోతోంది. కిటికీ పక్కన కూర్చుని ఉన్నారు కామేశ్వరరావుగారు. చల్లటి గాలి కిటికీ గుండా దూసుకు వస్తోంది.

అనకాపల్లిలో ఎక్కారు శ్రావణి, భర్త భవానీశంకర్, కూతురు స్వాతి. స్వాతికి మూడేళ్లుంటాయి. రబ్బరు బొమ్మలా ఉంటుంది. కొత్త తెలియదు. ఆడుకుంటుంది తన మానాన తాను. ఆకలయినా మరే అవసరం వచ్చినా ఇల్లు పీకి పందిరి వేస్తుంది.

భవానీ శంకర్‌కి చేతిలో ఒక పుస్తకం ఉంటే చాలు పరిసరాలెరుగడు. అతనికి వ్యసనాలు మూడు. అరారా కాఫీ ప్రతి గంటకూ, ఆపైన వక్కపొడి, సిగరెట్టు, అవుంటే చాలు ప్రపంచం ఏమైపోయినా సమస్య కాదు అతనికి.

అందుకే శ్రావణి పెద్ద ఫ్లాస్కులో కనీసం ఏడెనిమిది కప్పుల కాఫీ తెస్తుంది ప్రయాణాల్లో. భవానీశంకర్ పోలీసు డిపార్టుమెంటులో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం భార్యా పిల్లతో విజయవాడ తండ్రి ఇంటికి వెళుతున్నాడు.

కాసేపు సర్దుడు తర్వాత సెటిలయ్యారు శ్రావణి, భవానీశంకర్. అటు భర్తని, ఇటు స్వాతిని చూసి నవ్వుకుంది శ్రావణి. ఇద్దరూ చంటిపిల్లలే. ఏ చిన్న అవసరం తీరకపోయినా గొడవే. అది ఇల్లు గానీ రైల్వే కంపార్ట్‌మెంటుగానీ.

కామేశ్వరరావు కొద్దిగా వత్తిగిల్లాడు. శ్రావణిని, స్వాతినీ పరిశీలనగా చూశాడు.

భవానీశంకర్ పక్కన ఉన్న పత్రికల కోసం చూస్తోంది శ్రావణి. స్వాతి 'గుడ్ డే' బిస్కట్లు కొరుకుతూ ఆడుకుంటోంది.

ఏదో ఒక పత్రిక చేతిలో పట్టుకుని కిటికీ వైపు చూసిన శ్రావణికి గుండె ఆగినంత పనయింది. కామేశ్వరరావు రూపం చాలా భయంకరంగా అనిపించింది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. గడ్డం మాసిపోయి ఉంది. బట్టలు నలిగి ఉన్నాయి. కళ్లలో ఏదో అసహనం.

శ్రావణి నవ్వు మందగించింది. కిటికీ దగ్గర ఉన్న ఈ వ్యక్తి ఎవరు? ఎందుకలా చూస్తున్నాడు.

దొంగ కాదు కదా..? వయసు అరవై దాటి ఉన్నాయి. అయితే మాత్రం దొంగ కాకూడదని ఎక్కడన్నా ఉందా? ఈమధ్య రైల్వే కంపార్టుమెంట్లలో జరుగుతున్న దొంగతనాలు ఒకసారి గుర్తుకు తెచ్చుకుంది శ్రావణి.

తన వైపుచూసుకుంది. చంద్రహారం గొలుసు నాలుగు పేటలు, రాళ్ల నెక్లెసు, కొత్తగా కొన్న పెండెంటు హారం, నల్ల పూసలు, పుస్తెలతాడు, చేతులకి నాలుగు జతల గాజులు, బంగారం ఎక్కువే. అయినా పోలీసు డిపార్టుమెంటు మొగుడ్ని పక్కన పెట్టుకుని తనకీ భయం ఏమిటి? నవ్వొచ్చింది తన ఆలోచనలకి శ్రావణికి.

చీర సవరించుకుంటూ మెడ చుట్టూ కొంగు సవరించుకుంది బంగారు వస్తువులు కనబడకుండా.

కామేశ్వరరావు కళ్లు మూస్తున్నాడు. ఉండుండి సగం తెరుస్తున్నాడు స్థిమితంగా లేడు. కొద్ది క్షణాల తర్వాత శ్రావణికి అనుమానం కలిగింది. ఆ ముసలాయన స్వాతి వైపు చూస్తున్నాడా?

స్వాతి చేతికి రెండు గాజులు, చెవులకు బుట్టలోలకులు, మెళ్లో సింగిల్ చెయిన్.

ఏదో మాయ చేసి పిల్ల మెళ్లోవి కొట్టెయ్యడు కదా. ఎంత దగ్గరకి లాగినా స్వాతి దూరంగా వెళ్లి బొమ్మలతో ఆడుకుంటోంది.

రైలు సామర్లకోట దాటుతోంది. శ్రావణి భయం అంతకంతకు పెరిగిపోతోంది.

నెమ్మదిగా భవానీశంకర్ పక్కకు చేరి తన భయాన్ని చెప్పింది.

పోలీసు డిపార్టుమెంటు అతను. చూడగానే చెప్పగలడు. ఎవరు ఏ జాతి మనిషో. "ఛ.. ఊరుకో.. ఆయన్ని చూస్తుంటే క్రిమినల్‌లా లేడు. వెధవ భయం నువ్వు.." చిరాకు పడ్డాడు. "ప్రతిదానికీ అంత చాదస్తం కూడదు" అన్నాడు.

"అది కాదండీ అతని చూపెందుకో అనుమానంగా ఉంది. కాస్త కనుక్కోండి. ఆ తర్వాత ఏమనుకునీ లాభం లేదు"

ప్రయాణం సుఖంగా సాగాలంటే శ్రావణి అనుమానాలు తీర్చక తప్పదు. అవతల ఆయన పెద్దమనిషిలా ఉన్నాడు.

తప్పనిసరిగా లేచి వెళ్లాడు. గొంతులోకి పోలీసు దర్పం వచ్చింది. "మిస్టర్... ఎవర్నువ్వు. ఎక్కడ్నించి వస్తున్నావు? ఎక్కడికి వెళుతున్నావు? నీ ఐడెంటిటీ ఏవన్నా ఉందా?" చుట్టుపక్కల వాళ్లు ఉత్సాహంగా చూస్తున్నారు.

కామేశ్వరరావు అయోమయంగా చూశాడు. ఆ తర్వాత తలెత్తి భవానీశంకరాన్ని చూశాడు. తర్వాత జేబులోంచి ఒక ఐడెంటిటీ కార్డు తీసి భవానీశంకరం చేతిలో ఉంచాడు. అది పరిశీలించిన భవానీశంకర్ అదిరిపడ్డాడు. డిస్ట్రిక్ట్ ఆఫీసులో కలెక్టరు హోదాలో పనిచేసి రిటైరైన పెద్ద ఆఫీసరాయన. "సారీ సర్. మిమ్మల్ని అనుమానించాను క్షమించండి" కంగారుగా శాల్యూట్ చేశాడు.

మళ్లీ వచ్చి తన సీట్లో కూర్చుంటూ శ్రావణి మీద చిరాకు పడ్డాడు.

"అది కాదండీ మీరు సరిగ్గా చూశారా?" శ్రావణికి ఇంకా అనుమానం. పెళ్లయిన కొత్తలో వాళ్ల అమ్మ చెప్పింది... మొగుడి బుర్ర, మనసు కొద్ది కొద్దిగా కొరుక్కు తింటే పిచ్చెక్కి వాడే పారిపోతాడు అని.

"ఇంక నోర్ముయ్" కళ్లెర్రచేశాడు అదే బ్రహ్మాస్త్రం.

"అమ్మా నీ పేరు శ్రావణి కదూ" ఇందాకణ్నుంచి మౌనంగా చూస్తున్న కామేశ్వరరావు అడిగాడు.

"అవునండీ తాతగారు మీరూ..." కాస్సేపు ఆగిపోయింది శ్రావణి గుర్తులు దొరక్క.

"నీకు ఇంటర్మీడియట్‌లో శ్రీలక్ష్మి అని క్లాస్‌మీట్ ఉండేది కదమ్మా"

"అవునండీ.. మీరు...మీరు... శ్రీలక్ష్మి తాతగారు కామేశ్వరరావుగారు కదా. అప్పట్లో తాసీల్దారుగా చేసేవారు..." ఒక్క ఉదుటున లేచి పక్క సీట్లో వాళ్లని సర్దుకోమని ముందుకు వెళ్లింది శ్రావణి.

"గుర్తుపట్టావా అమ్మా? ఇందాకట్నుంచీ నీ పేరు గుర్తుకు తెచ్చుకోవడానికే నిన్నలా చూస్తున్నానమ్మా. ముసలితనం కదా ఒక పట్టాన నీ పేరు గుర్తుకు రాలేదు. అతను నీ భర్తా? ఈ అమ్మాయి నీ కూతురా బాగుందమ్మా..."

"అవునండీ తాతగారూ శ్రీలక్ష్మి ఎక్కడుంది?" ఆత్రుతగా అడిగింది శ్రావణి.

"అమెరికాలోనమ్మా"


"ఏమిటి ఇలా ఉన్నారు తాతగారూ" ఆత్రంగా అడిగింది శ్రావణి.

"ఎక్కువ మాట్లాడలేను. క్లుప్తంగా చెబుతానమ్మా"

కామేశ్వరరావు కళ్లు మూసుకున్నాడు.

"మా పెద్దమ్మాయి విశాఖపట్నంలో ఉంటుంది. దాని అత్తగారికి సీరియస్‌గా ఉంటే ఇంటినీ, పిల్లల్ని చూసుకోవడానికి రమ్మని నాకు ఫోన్ చేసింది..నిన్న బయల్దేరి వచ్చానమ్మా ఆ ఫోన్ అందుకని...నా పెళ్లాం నా కంటే మతిమరుపుది. అన్నీ సర్దింది కానీ డబ్బు క్రెడిట్ కార్డు పెట్టలేదు. నా చొక్కా పైజేబులో రెండొందలున్నాయి. మామూలుగా టిక్కెట్టు కొనుక్కొని ఆ పైన ఆటోలో మధురవాడ వెళ్లిపోయాను. నేను వెళ్లేసరికే మా అమ్మాయి అత్తగారు పోయిందని ఫోను వచ్చిందట. తాళాలేసుకుని అందరూ ఫ్లైట్‌లో హైదరాబాద్ వెళ్లిపోయారు"

"ఇంక అక్కడ్నించి ఉండమ్మా నా అవస్థ... వెతుక్కుంటే పర్సూ లేదు. కనీసం క్రెడిట్ కార్డు లేదు. నడుచుకుంటూ మధురవాడ నుంచి స్టేషన్‌కి వచ్చాను చేతిలో చిల్లి గవ్వ లేకుండా...ఈ ఐడెంటిటీ కార్డు చూపించి ఎవరికన్నా చెప్పబోయినా ఇదేదో హైక్లాస్ బెగ్గింగ్ అనుకుంటారు కానీ నా ఇబ్బంది గమనించరు. తన దాకా వస్తేనేగానీ తెలియదని సామెత చెబుతారే అలా...రాత్రంతా స్టేషను బయట ఇనుప బెంచీ మీద పడుకున్నాను. భోజనం చేయలేదు. అందుకే నిస్త్రాణ. అందులోనూ పది కిలోమీటర్లు నడిచి వచ్చానేమో అదీ కారణం"



నా అదృష్టం. నా దగ్గర పనిచేసిన అతనొకడు విజయనగరంలో పనిచేస్తున్నాట్ట. రోజూ విశాఖ పట్నం నుంచి విజయనగరం వెళ్లి వస్తూంటాట్ట. అతను కలిశాడు. అతనికి నా బాధ చెప్పుకోలేను. ఇంతకీ అతను పరిగెట్టుకు వెళ్లి కాఫీ తెచ్చాడు. 'సర్ విజయవాడకే గదా' అని టిక్కెట్టు కూడా కొని తెచ్చాడు ఆ తర్వాత 'వస్తాను సర్' అని నమస్కారం పెట్టి విజయనగరం ట్రైన్ ఎక్కేశాడు. నా దగ్గర పని చేసిన వాణ్ని ఓ వంద రూపాయలిమ్మని ఎలా అడగను?"

"అయ్యో ఎంత పని జరిగింది తాత గారూ" శ్రావణి కంఠంలో జాలి ధ్వనించింది.

"ఏదో విజయవాడ చేరితే ఏదో విధంగా ఇల్లు చేరతాను. కానీమ్మా అప్పటి దాకా ప్రాణాలు నిలిచేట్లు లేవు. ఎందుకంటే నేను ఇరవై ఏళ్ల నుంచీ షుగర్ పేషెంట్‌ని...షుగర్ సిగ్గెరుగదు కదమ్మా...ఇందాకట్నుంచీ నేను చూసేది మీ పాప వంటి మీద నగలు కాదమ్మా చేతిలో ఉన్న బిస్కట్లు..రాత్రి భోజనం లేదు. ప్రొద్దుట్నుంచీ టిఫిన్ లేదు. షుగర్ లెవెల్ పడిపోయి నాకప్పుడే తల తిరుగుతుంది. ఈ వ ం ం స లా డి ప్రాణాలు నిలబెట్టాలంటే...అమ్మా రెండు బిస్కట్లు కుదిరితే ఓ కప్పు కాఫీ..ఇంతకన్నా ఏం మాట్లాడలేను తల్లీ"

"అదేదో సినిమా డైలాగ్‌లాగ. ఇంత నీరసంలోనూ సరదాగా మాట్లాడారు..ఆగండి తాత గారూ..." బిస్కట్ ప్యాకెట్, కాఫీ కప్పుతో తయారైపోయాడు అప్పటికప్పుడే భవానీశంకర్.